

ప్రింటింగ్ ప్రెస్‌లో అగ్ని ప్రమాదం

రాయచూరు, జూలై 26 : నగరంలోని పెట్లబుర్జు సమీపంలోగల వీరేశ్వర ప్రింటింగ్ ప్రెస్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం ఉదయం ప్రింటింగ్ ప్రెస్‌లో నుంచి మంటలు, పొగలు బయటికొస్తుండగా స్థానికులు పోలీసులకు, యజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికొచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేశారు. అప్పటికే పెద్ద ఎత్తున ప్రింటింగ్ ప్రెస్‌లో ఉన్న పేపర్లతో సహా మిషన్లు పూర్తిగా కాలిపోయినట్లు గుర్తించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

సైబర్ మోసాల్లో బెంగళూరు టాప్



ఐదేళ్లలో 9,553 కేసులు

కోల్పోయింది రూ. 594 కోట్లు

రికవరీ రూ. 73 కోట్లు

ఆన్‌లైన్ యాప్‌లతో నిలువు దోపిడీ

నకిలీ లోన్ యాప్‌ల మోసాలు

సంవత్సరం	కేసులు	వంచన మొత్తం(రూ.)	రికవరీ(రూ.)	పరిష్కారమైనవి
2020	51	98 లక్షలు	2.59 లక్షలు	41
2021	209	1.64 కోట్లు	44.87 లక్షలు	170
2022	411	13.80 కోట్లు	1.30 కోట్లు	158
2023	517	6.88 కోట్లు	1.28 కోట్లు	130
2024	134	4.61 కోట్లు	32 లక్షలు	11

ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు

సంవత్సరం	కేసులు	వంచన మొత్తం(రూ.)	రికవరీ(రూ.)	పరిష్కారమైనవి
2020	394	5.67 కోట్లు	8.80 లక్షలు	232
2021	570	12.31 కోట్లు	2.21 కోట్లు	422
2022	977	23.11 కోట్లు	3.95 కోట్లు	630
2023	4470	347.7 కోట్లు	46.73 కోట్లు	1036
2024	1820	178.18 కోట్లు	15.72 కోట్లు	68



బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఐటీ నగరిగా పేరున్న బెంగళూరులో సైబర్ నేరగాళ్లకు కూడా కొదవ లేదు. డిజిటల్ యుగంలో కూర్చున్న చోటే అన్ని పనులు చక్కబెట్టేస్తున్నారు. కేవలం ఒక్క ఫోన్‌కాల్‌తో మభ్యపెట్టి లక్షల నుంచి కోట్ల దాకా కొల్లగొట్టేస్తున్నారు. దేశంలోనే ఆధునిక, ఐటీబీటీతోపాటు ఎంఎన్‌సీ కంపెనీలు, అత్యధిక ఉన్నత విద్యాసంస్థలు కలిగిన బెంగళూరు నగరంలో సైబర్ మోసాలు కూడా అధికంగానే సాగుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో నమోదైన ఆన్‌లైన్ మోసాలలో 73 శాతం బెంగళూరు నగరంలోనే ఉన్నాయి. ఈ వ్యవధిలో బాధితులు రూ.594.94 కోట్లు కోల్పోయారు. రూ.73.04 కోట్లు మాత్రమే రికవరీ సాధ్యమైంది. ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించడం, అమాయకుల నుంచి నగదు దోచుకోవడం, నకిలీ లోన్‌యాప్ ద్వారా రుణాలను మంజూరు చేయిస్తామనే ఆశ కల్పించడం వంటివి నిత్యకృత్యమయ్యాయి. వేలాది మంది ప్రజలు తమ ఆధార్, పాన్‌కార్డ్, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇచ్చి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా రుణాలు పొందుతున్నారు. మొబైల్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకుంటున్నారు. ఇలా మోసగాళ్లు మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని దోచుకోవడం ద్వారా వారి ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారు. ఆటో డ్రైవర్, కార్మికులు, స్థానికులు నగదు ఆశ చూపి వేలాదిమంది ఆధార్, పాన్‌బ్యాంకు వివరాలను ఇచ్చి రుణాలు పొందుతున్నారు. నగదు జమ చేసేందుకు ఓటీపీ చెప్పాలంటూ నమ్మించి ఖాతాలలోని నగదును కాజేస్తున్నారు. ఇలా నగదు కోల్పోయిన వారు తల్లడిల్లుతున్నారు. మోసగాళ్లు మాత్రం తమ నెట్‌వర్క్‌ను విస్తృతం చేసుకుంటున్నారు. ఇటీవల కొన్నిరోజులుగా విదేశాలకు పార్శిల్స్ పంపేవారి వివరాలను తెలుసుకుని మీరు పంపిన కవర్‌లో కొన్ని పాస్‌పోర్ట్‌లు, ఇతరత్రా వివరాలు ఉన్నాయని, తాము ముంబై నుంచి సీబీఐ అధికారులమంటూ నమ్మించి వెంటనే మీ ఖాతా వివరాలు పంపాలని లేదంటే అరెస్టు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. బెంగళూరులో ఓ మహిళా అడ్వకేట్‌ను రెండురోజుల పాటు ఇంటి నుంచి కదలకుండా వీడియోకాల్‌లో మాట్లాడాలంటూ డ్రగ్స్ తీసుకుంటున్నారని వేధించారు. ఆమె నగ్న వీడియోలు, ఫొటోలను పంపి కోరినంత డబ్బు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించారు. అప్పటికే ఆమె నుంచి లక్షలాది రూపాయలు కాజేసిన విషయం తెలిసిందే. మోసపోయిన బాధితులు సైబర్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. వీటిలో భాగస్వామ్యులైనవారిపై పోలీసులు, ఐటీ, బీఎన్ఎస్‌తోపాటు ఇతర సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. మోసగాళ్లు ఇతర రాష్ట్రాలు దేశాల్లో ఉంటూ దోపిడీకి పాల్పడుతున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 9,553 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జూలై 10వరకు 1820 ఆన్‌లైన్ ఉద్యోగాల మోసాలు, నకిలీ లోన్‌యాప్‌ల ద్వారా మోసం చేశారు. ఐదేళ్ల వ్యవధిలో కేవలం 205మందిని మాత్రమే అరెస్టు చేయగలిగారు.



స్మారక స్తూపానికి వందనం చేస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

కార్గిల్ వీరులకు సీఎం నివాళి

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని దేశరక్షణలో విధులు నిర్వహించి ప్రాణాలు కోల్పోయిన వీరులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సైనిక గౌరవ వందనం సమర్పించారు. శుక్రవారం నగరంలోని సైనిక స్మారక స్తూపానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పోరాడి అసువులుబాసిన సైనికుల గౌరవార్థం కార్గిల్ విజయ్‌దివస్‌గా ఆచరిస్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులను స్మరించుకోవాలన్నారు. ఆ వీరులను ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశం కోసం పాటుపడాలన్నారు. ఇదే సందర్భంగా సైన్యం అధికారులు, కుటుంబీకులను పరామర్శించారు.

చీఫ్ సెక్రటరీగా శాలిని

రజనీశ్ గోయెల్ స్థానంలోకి భార్య



రజనీశ గోయెల్



శాలిని రజనీశ్


బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయెల్ స్థానంలో ఆయన భార్య శాలిని రజనీశ్ నియమితులయ్యారు. శుక్రవారం కేబినెట్‌లో ఈ మేరకు తీర్మానించారు. రజనీశ్ గోయెల్ ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్నారు. ఆయన స్థానంలో భార్య శాలిని రజనీశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం అదనపు చీఫ్ సెక్రటరీ హోదాలో డెవలప్‌మెంట్ కమిషనర్‌గా ఉన్నారు. సీనియారిటీ ప్రాధాన్యత పరంగా రాష్ట్ర కేడర్ ఐఏఎస్‌లలో అజయ్‌సేఠ్‌కు అవకాశం ఇవ్వాల్సి ఉండేది. ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పైగా అజయ్ సేఠ్ పదవీకాలం 11నెలలు మాత్రమే ఉంది. అజయ్ సేఠ్ రాష్ట్ర సర్వీసులకు వచ్చే ఆలోచన లేకపోవడంతో తర్వాతి స్థానంలో ఉన్న శాలిని రజనీశ్‌కు అవకాశం దక్కింది. ఆమె 2027 జూన్ దాకా సర్వీసులో ఉంటారు. సుదీర్ఘకాలం తర్వాత చీఫ్ సెక్రటరీగా భర్త తర్వాత భార్య నియమితులయ్యారు. గతంలో బీకే భట్టాచార్య పదవీ విరమణ పొందాక థెరెసా భట్టాచార్య అదే హోదాలో వ్యవహరించారు.

హైవేలలో ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలి

రోడ్డు ప్రమాదాలతోనే 13 శాతం మరణాలు

లోక్‌సభలో డాక్టర్ మంజునాథ్

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో 13 శాతం మరణాలు రోడ్డు ప్రమాదాలతోనే జరుగుతున్నాయని, జాతీయ రహదారులపై పాలి ట్రామా సెంటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ పేర్కొన్నారు. లోక్‌సభలో బడ్జెట్‌పై సమావేశంలో భాగంగా మంజునాథ్ తొలిసారి ప్రసంగించారు. దేశంలో మహమ్మారి కేన్సర్‌తో మృతి చెందేవారేకంటే రోడ్డు ప్రమాదాలతోనే అత్యధికమంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లలో ఎంబీబీఎస్, పీజీ సీట్లు పెంచడం, మెడికల్ కళాశాలల సంఖ్య పెంచడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రులకు ప్రత్యేక అభినందనలు అన్నారు. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడేదిశగా జాతీయ రహదారులపై ప్రతి 120 కిలోమీటర్లకు ఒక 300 పడకల పాలిట్రామా కేర్ సెంటర్‌ను స్థాపించాలని కోరారు. డాక్టర్ మంజునాథ్ ప్రస్తావించిన అంశాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ సభ్యుడు మంజునాథ్ సలహాలు స్వీకరిస్తామని, భవిష్యత్తులో ట్రామాకేర్ సెంటర్లు ప్రారంభించేందుకు పరిశీలిస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మంజునాథ్

శాసనసభా సమావేశాలు

ముందుగా ముగియడం బాధాకరం

స్పీకర్ యూటీ ఖాదర్

సభ జరిగినా ప్రతిఫలం లేదు : హొరట్టి

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ కార్యకలాపాలు ఒక రోజు ముందుగానే ముగియడం బాధాకరమని స్పీకర్ యూటీ ఖాదర్ పేర్కొన్నారు. శుక్రవారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 16వ శాసనసభ నాల్గో సెషన్ ఎనిమిదిరోజులు సాగిందన్నారు. 8రోజుల్లో 36 గంటల 50 నిమిషాలు కార్యకలాపాలు సాగాయన్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామన్నారు. గురువారం ముడాపై చర్చకు ప్రతిపక్షనేత అశోక్ డిమాండ్ చేయడం, అవకాశం లేకపోవడంతో గందరగోళం మధ్య నిరవధిక వాయిదా వేయాల్సి వచ్చిందని అన్నారు. 85 శాతం మంది సభ్యులు సభకు వచ్చారని తెలిపారు. 23 మంది సభ్యులు ప్రతిరోజూ సభలో ప్రవేశించేవారని పేర్కొన్నారు. ఏఐ కెమెరాలు అమర్చామని, సభ్యుల హాజరుపై ఖచ్చితత్వం గుర్తించేందుకు వీలు కలిగిందన్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఏ సభ్యుడు ఎంతసేపు సభలో గడిపారనేది నిర్ధారించవచ్చునని, ఇది ట్రయల్‌రన్‌గా ప్రవేశపెట్టామని తెలిపారు. కాగా, ముడా అవినీతిపై ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశం నిబంధనల కిందకు రాదని, అత్యవసరమైనది, ఇటీవల జరిగిన అంశం కాదని, చట్టబద్ధంగా విచారణలు సాగుతున్నాయని ఇటువంటి తరుణంలో చర్చకు వీలు లేదన్నారు. స్పీకర్‌గా తాను ఉండకపోయినా తన పరిధిలో చెడు సంప్రదాయం, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే అపవాదు రాకూడదని అన్నారు. ఒకరోజు ముందే కార్యకలాపాలు ముగియడం వ్యక్తిగతంగా బాధ కలుగుతోందన్నారు.

ప్రతిఫలమే లేదు : హొరట్టి

విధానపరిషత్‌లో కార్యకలాపాలు సజావుగానే సాగాయని, సభ జరిగినా ప్రతిఫలం లేదని పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి విచారం వ్యక్తం చేశారు. బిల్లును ప్రవేశపెట్టే ముందు సమగ్ర చర్చ జరగాలని, సభ్యుల అభిప్రాయాలు క్రోడీకరించకుండానే అంగీకరించడం సరికాదన్నారు. పరిషత్‌లో ప్రతిపక్ష సభ్యులదే మెజారిటీ అన్నారు. అయినా అన్ని బిల్లులకు అంగీకారం తెలిపారని వివరించారు. పరిషత్‌లో 93 శాతం మంది సభ్యులు హాజరయ్యారన్నారు. ఓ ప్రశ్నకు సమాధానం కోసం రూ.97 వేలు ఖర్చు అయిందని, ఆ అంశంపై చర్చ జరగకుంటే ప్రజాధనం దుర్వినియోగం కాదా అన్నారు. 45 ఏళ్లుగా పరిషత్‌లో ఉన్నానని, ఇటీవల కార్యకలాపాలు జరపడం ఎవరికీ ఇష్టం లేదన్నారు. ఏడాదికి 60 రోజులు శాసనసభ సమావేశాలు జరగాలనే నిబంధన ఉన్నా కొనసాగుతాయనే నమ్మకం లేదని, భవిష్యత్తులో మరింత తగ్గవచ్చునని విచారం వ్యక్తం చేశారు. సభ్యుడు విశ్వనాథ్ విదేశాలకు వెళ్లడంతో ఆయన మినహా మిగిలిన సభ్యులందరూ సభకు హాజరయ్యారని అన్నారు. 25 మంది కొత్త సభ్యులు ఉన్నారన్నారు. సభలో తమకు అవకాశం కల్పించడం లేదని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేసిన మేరకు తనపై అవిశ్వాసం పెట్టాలని వ్యాఖ్యానించానని అన్నారు. సభలో సమగ్రమైన చర్చలు జరపకపోవడం బాధ కలుగుతోందన్నారు. తన మనసుకు వ్యతిరేకంగా కార్యకలాపాలు జరిగాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

గవర్నర్‌తో స్పీకర్, సభాపతి భేటీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్, సభాపతి


బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి)
వర్షాకాల శాసనసభ సమావేశాలు ముగిసిన సందర్భంగా గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను స్పీకర్ యూటీ ఖాదర్, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందచేశారు. శాసనసభ కార్యకలాపాల గురించి గవర్నర్‌కు

నాపై బీజేపీ, జేడీఎస్ కుట్ర

నా ప్రతిష్టను దెబ్బతీయడానికే ముడా ఆరోపణలు

సభా సమయాన్ని వృథా చేశారు

మండిపడ్డ ముఖ్యమంత్రి సిద్దరామయ్య



విధానసౌధలో మీడియాతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో తన భార్యకు ఇంటి స్థలాలు కేటాయించడంలో అవినీతి జరగలేదని అయినా బీజేపీ, జేడీఎస్ సభ్యులు తనకు చెడ్డ పేరు తీసుకురావాలనే కుట్ర పన్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. తాను రెండోసారి సీఎం కావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. విధానసౌధలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముడాలో అవినీతి జరిగిందని వాయిదా తీర్మానానికి ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారని అన్నారు. స్పీకర్, సభాపతి చర్చకు అవకాశం ఇవ్వలేదని, ఇది చెడు సంప్రదాయం అవుతుందని వారు నిరాకరించారని తెలిపారు. రాజకీయ దురుద్దేశ్యంతో వాయిదా తీర్మానం కోరడమే తప్పు అన్నారు. రెండు రోజులు కార్యకలాపాలను అడ్డుకున్నారని అన్నారు. ప్రజాసమస్యలపై చర్చకు అవకాశం లేకుండా నిరంతరం నిరసనలు కొనసాగించారని తెలిపారు.

రాష్ట్రమంతటా వరదలు కొనసాగుతున్నాయని, వాటి నష్టాలపై సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే ప్రస్తావించారని, ప్రతిపక్ష సభ్యులు స్పందించలేదని పేర్కొన్నారు. 40 ఏళ్ల కిందటే మంత్రి అయ్యానని, తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం అన్నారు. ప్రతిపక్షాల నాయకులు కక్షతో రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలలో వారు విశ్వాసం కోల్పోయారని తెలిపారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. మైసూరులో దశాబ్దాల కాలం క్రితం సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు బోర్డు (సీఐటీబీ) ఉండేదని, 1987లో ముడా ఏర్పడిందన్నారు. తన బావమరిది బీఎం మల్లికార్జునస్వామి 464 సర్వేలో 3.16 ఎకరాల వ్యవసాయ భూమిని 2004లో కొనుగోలు చేశారని తెలిపారు. పీటీసీ చట్టం ప్రకారం ఉల్లంఘన జరగలేదన్నారు. సదరు భూమిని మల్లికార్జునస్వామి మైసూరుకు చెందిన నింగాలింగ్ జౌరా అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశారని అన్నారు. అతడికి ముగ్గురు కొడుకులు కాగా చిన్నకుమారుడు దేవరాజ్‌కు రాసిచ్చారన్నారు. అతడి నుంచే భూమి కొనుగోలు చేశారన్నారు. అది పిత్రార్జిత ఆస్తి అన్నారు. ఇటీవల వారి వారసుడు మంజునాథ్‌ను తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. మల్లికార్జునస్వామి ఆడపడుచు లాంఛనంగా తన భార్య పార్వతికి దానవిక్రయం చేశారని తెలిపారు. సదరు భూమిని ముడా స్వాధీనం చేసుకుని పార్కును ఏర్పాటు చేసిందన్నారు. పరిహారంగా 14 ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఇందులో ఎక్కడా అవినీతి లేదని, అంతా చట్టానికి అనుగుణంగా ఉందన్నారు. బీజేపీ-జేడీఎస్ పార్టీలు పనిగట్టుకుని రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

సభా సమయాన్ని వృథా చేశారు

శాసనసభ కార్యకలాపాలలో సమయాన్ని వృథా చేశారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. ఒకరోజు ముందుగానే సభ ముగిసేందుకు బీజేపీ, జేడీఎస్ నాయకులు కారకులయ్యారని అన్నారు. ప్రజాసమస్యలపై చర్చలకు వీలు లేకుండా వాల్మీకి కార్పొరేషన్ అంశాన్ని మొదటివారంలోనూ, ముడా స్థలాల అంశాన్ని రెండోవారంలో సభలో చర్చకు డిమాండ్ చేసి సమయాన్ని వృథా చేశారని పేర్కొన్నారు.

కుమారస్వామికి ఇంటి స్థలం
మంత్రి బైరతి సురేశ్

ముడా పరిధిలో కేంద్రమంత్రి కుమారస్వామికి ఇంటి స్థలం ఉందని నగరపాలక శాఖ మంత్రి బైరతి సురేశ్ తెలిపారు. ఆయన 1984 నవంబరు 7న మంజూరు చేశారని పేర్కొన్నారు. జేడీఎస్, బీజేపీకి చెందిన నాయకులకు ఇళ్లస్థలాలు ఉన్నాయని, వీరిలో ఎమ్మెల్యే జీటీ దేవెగౌడకు రెండు చోట్ల, బీజేపీ ఎమ్మెల్సీ హెచ్. విశ్వనాథ్, సా రా మహేశ్‌తోపాటు పలువురికి ఇళ్లస్థలాలు ఉన్నాయని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.99	1,611.27
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	87,766	98,357
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	83,969	198
సామర్థ్యం (టీఎంసీలు)	101.73	40.14

రక్తదానం.. మహాదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, జూలై 26: రక్తదానం అంటే మహాదానమని, నేటి యువతరం స్వచ్ఛందంగా మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బళ్లారి లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు సూచించారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బళ్లారి యూత్ రెడ్‌క్రాస్ యూనిట్, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్, యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం కంటే గొప్ప దానం లేదని, మానవాళి కోసం రక్తదానంచేస్తే మనకు కొత్త స్ఫూర్తి వస్తుందన్నారు. విమ్స్ డైరెక్టర్ గంగాధర్ గౌడ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో రక్తం అవసరం ఎక్కువగా ఉందన్నారు. యూనివర్శిటీ చానల్సర్ ప్రొఫెసర్ తిప్పేరుద్రప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యంకాదన్నారు. యూనివర్శిటీ చాన్సలర్ రుద్రేశ్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందన్నారు. యూనివర్శిటీ సిబ్బంది. విద్యార్థులతో సహా 150మందిపైగా రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



అవగాహనా కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధికారులు

బళ్లారి రూరల్, జూలై 26 : తాలుకాలోని గోడేహాళ్ సమీపంలో ఉన్న తిరుమల హైస్కూల్, సిడిగినమల హైస్కూల్ ఆవరణలో మహిళా సంక్షేమ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మత్తు ఇలాఖె అధికారి లలితమ్మ మాట్లాడుతూ పిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేయరాదని, పనులకు పంపించరాదన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల హైస్కూల్ కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్ఎం నాగరాజు ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ముత్తమ్మ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఏఐకేకేఎంఎస్ నిరసన



కేంద్రబడ్జెట్ ప్రతులను కాల్చివేస్తున్న ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, జూలై 26: అఖిల బారతరైతు కృషి కార్మికుల సంఘం (ఏఐకేకేఎంఎస్) రాష్ట్రసమితి శుక్రవారం కేంద్రప్రభుత్వం విడుదల చేసిన రైతు వ్యతిరేక బడ్జెట్ కాపీలను కాల్చివేసి ఆక్రోశాన్ని వ్యక్తపరిచింది. ఈసందర్భంగా సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు సునీత్ కుమార్ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరం కేంద్ర బడ్జెట్ అత్యంత జనవ్యతిరేకిగా ఉందన్నారు. ఇది రైతుల జీవితాలకు పరిహారం ఇవ్వక అపద్దపు హామీలు ఇస్తుందన్నారు. రైతులు పండించిన తమ ఉత్పత్తులకు 50శాతం మద్దతుధర ప్రకటించాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శశిధర్ మాట్లాడుతూ.. దేశంలోని రైతులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, నరేగా వ్యవస్థను బలపర్చి రుణాల మాఫీ చేయాలని,పింఛన్ ఇవ్వాలన్నారు. దీని కోసం పోరాటాలు చేయాలన్నారు. నిరసనలో రాష్ట్ర కార్యదర్శి భగవాన్‌రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యాక్షులు నాగమాళ్ స్వామి, మహేశ్, గోవింద్,దీపా, శరణు గూగల్, జిల్లాకార్యదర్శి గణపతి, మహేశ్, గోవింద్, గురళ్ళిరాజు పాల్గొన్నారు.

ఉప్పొంగిన తుంగ





కంప్లి కోట వద్ద పొంగి ప్రవహిస్తున్న తుంగభద్ర

- కంప్లి, గంగావతిల మధ్య రాకపోకల బంద్
- 30 గేట్ల ద్వారా నదికి 1,07,096 క్యూసెక్కుల నీటి విడుదల
- గంజికేంద్రాల ఏర్పాటు

కంప్లి, జూలై 26 : తుంగభద్ర జలాశయం నుంచి అత్యధిక స్థాయిలో నీరు నదికి విడుదల చేయడంతో కంప్లి, గంగావతి మధ్య రాకపోకలను అధికారులు ఆపివేశారు. జలాశయం నుంచి 30 గేట్ల ద్వారా నదికి 1,07,096 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నీరు వంతెనను తాకుతూ ప్రవహిస్తోంది. హంపి ప్రాంతంలోని కోదండరామాలయం, చక్రతీర్థం పూర్తిగా మునిగిపోయే విధంగా తుంగ పరవళ్లు తొక్కుతోంది. అలాగే కంప్లి కోట వద్ద చుట్టుపక్కల చెరుకు, అరటి తోటలు నీటిలో మునిగాయి. సన్నాపురం, బెళగోడుహాళ్ వద్ద నదికి వేసుకున్న మోటార్లను విప్పి రైతులు ఒడ్డుకు చేర్చుతున్నారు. అత్యధికంగా నీరు రావడంతో పరిస్థితిని జిల్లా అధికారులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ శోభారాణి, జెడ్పీసీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరులు సమీక్షించారు. అంతకుముందు ఉదయం అధికారులు జలాలాయప్ప, లేబర్ ఆఫీసర్ మోనేష్, కంప్లి కోట, సన్నాపురం, ఇటిగి గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ ప్రతి యేటా జలాశయం నుంచి ఎక్కువగా నీరు రావడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. ఈ ఏడు ఇప్పటికే కొప్పళ జిల్లా గంగావతి నుంచి కంప్లి వైపు రాకపోకలు కూడా బంద్ చేశామన్నారు. కంప్లి కోటలోని 50 కుటుంబాల మత్స్యకారులకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వారు నది ఉధృతం తగ్గే వరకు గంజి కేంద్రాల్లో వుంటూ జీవనం కొనసాగించాలన్నారు. వీటితో పాటు బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి గ్రామాల్లో కూడా గంజి కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీనికి తోడుగా ఆరోగ్య శాఖ, అంబులెన్స్‌లు సిద్ధంగా వుంచామన్నారు. మత్స్యకారులు నది ఒడ్డుకు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు చేశామన్నారు. ఇంకా ఎక్కువగా జలాశయంలోకి నీరు వచ్చినట్లయితే వంతెన పైకి కూడా నీరు వచ్చే అవకాశం వుందన్నారు.

పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, తదితర శాఖల సిబ్బంది అప్రమత్తంగా వుంటూ ఎలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్‌కుమార్, ముఖ్య అధికారి దుర్గన్న, ఈవో శ్రీకుమార్, డాక్టర్ అరుణ్ కుమార్, ఏడీ మల్లన్నగౌడ, బసవరాజు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నదికి వాయనం

కంప్లి, జూలై 26 : తుంగభద్ర నదికి అత్యధికంగా నీరు రావడంతో హసురుసేన రైతు సంఘం నేతలు కంప్లి కోట వద్ద వాయనం వదిలారు. ఈ సందర్భంగా బీవీ గౌడ, హేమయ్య స్వామిలు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం భర్తీ కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, రెండు పంటలకు అనుకూలమవుతుందన్నారు. ఈ ప్రాంతాల్లో కూడా బ్యారేజీలు, చెక్ డ్యామ్‌లా ఏర్పాటు చేస్తే నీరు వృథా కాకుండా వుంటాయన్నారు. వేసవికాలంలో కూడా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయడం వల్ల నీరు నిల్వ వుంచుకునేందుకు అనుకూలమవుతుందన్నారు.. నాయకులు మరో వంతెనను ఏర్పాటు చేస్తే రాకపోకలకు అంతరాయం కలుగకుండా వుంటుందన్నారు. అత్యధిక నీరు రావడం వల్ల రైతులు, ప్రయాణికులు, ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కొట్టూరు రమేష్, మురారి, అరవింద్, నందగౌడ, వీరేష్, శ్రీనివాసులు, రామన్న పాల్గొన్నారు.



నదిలో వాయనం వదులుతున్న నేతలు



డ్యాం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మిశ్రా, ఎస్పీ శోభారాణి



నదిలో నుంచి మోటార్లను బయటకు తీస్తున్న రైతులు



నీటి మునిగిన చెరకు తోట

బళ్లారిలో గృహశోభ లివింగ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బళ్లారి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు అవసరమైన గృహోపయోగ వస్తువులను అందుబాటు ధరలతో అందజేసే గృహశోభ ఎగ్జిబిషన్‌ను బళ్లారిలో నెలకొల్పడం ఆనందకర విషయమని బళ్లారి జిల్లా కమ్మసంఘ జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూఫ్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం కమ్మభవనంలో గృహశోభ లివింగ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను కమ్మసంఘం నాయకుడు ముండ్లూరు అనీఫ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ గృహోపయోగ వస్తువుల ప్రదర్శనలో నాణ్యమైన పెద్ద సంస్థల వస్తువుల అన్నింటినీ ఒకే వేదికపై ఏర్పాటు చేయడం హర్షనీయం అని అన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు నాగచంద్ర మాట్లాడుతూ దాదాపు 15 సంవత్సరాలుగా బళ్లారిలో అన్ని రకాల సంస్థలకు చెందిన నాణ్యమైన గృహోపయోగ వస్తువులతో ఎగ్జిబిషన్ ను ప్రజలకు పరిచయం చూస్తూ కమ్మ భవనంలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆదారభిమానాలు చూరగొన్నామని ఇదే విధంగా ఈ ఏడాది కూడా 10 రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగిస్తున్నామన్నారు. తమ ఎగ్జిబిషన్‌లో ఫర్నిచర్స్, ఫ్యాబ్రిక్స్, విక్రమ్ టీ. ఎలెక్ట్రానిక్ కాఫీ హెల్త్ ఎక్యూప్‌మెంట్, పిల్లలకు అటవస్తువులు, ఫుడ్ కోర్టు, అత్యాధునికమైన గృహోపకరణ వస్తువులను ఎగ్జిబిషన్‌లో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కమ్మసంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూఫ్ కుమార్

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బళ్లారిరూరల్, జూలై 26 : బళ్లారి నగరంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయల్ సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్రానికి ఖాళీ చెంబు ఇచ్చిందంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, డీసీసీ కార్యదర్శి బోయపాటి విష్ణువర్ధన్, కాంగ్రెస్ ప్రముఖులు ముందు నాగరాజ్ బళ్లారి మహానగరిపాలిక మేయర్ ముల్లంగి నందీష్, వెంకటేష్, చిదానందప్ప మా అన్నయ్య కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మంజుళ, మాజీ మేయర్ రాజేశ్వరి, మాజీ ఉప మేయర్ జానకమ్మ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండురావు

బళ్లారి సిటీ, జూలై 26: డెంగీ వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండురావు.. అన్ని జిల్లాల కలెక్టర్లు, జీపీఏఎంసీ ఈఓలను ఆదేశించారు. డెంగీ నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేసేందుకు ఆయన బెంగళూరులోని తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జీపీఎంసీ ఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డెంగీ ప్రబలితే ఆ ప్రాంతంలో ఫ్యూమిగేషన్ నిర్వహించాలని, పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి చుట్టూ పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షానికి ఇంటి ఆవరణ, పెరడు వారానికోసారని శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రంచేసేలా స్థానిక అధికారులను ఆదేశించాలన్నారు. వారానికోసారి ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాను పర్యవేక్షించాలని, అవసరమైన చర్యలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షగుప్తా, కమిషనర్ రణదీప్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. ప్రస్తుతం డెంగీ నియంత్రణలో ఉందని మరిన్ని సమూనా పరీక్షలు నిర్వహించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తదితర అధికారులు

ఆసుపత్రుల్లో అదనపు పడకలు ఏర్పాటుచేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా ఎండిమిక్ డీసీజ్ కంట్రోల్ అధికారి డాక్టర్ అబ్దుల్లా .జిల్లా కీటక శాస్త్రవేత్త డాక్టర్ నందకాడి, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనరవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జయతీర్థుల ఆరాధన

కంప్లి, జూలై 26 : ఆనెదొంగి నంజనగూడు రాఘవేంద్రస్వామి మంటపం ఆధ్వర్యంలో జయతీర్థులు మధ్య ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం రాఘవేంద్ర స్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు, పుష్పాభిషేకం, వివిధ అలంకరణలు చేపట్టారు. ప్రతి యేటా ఆనెగొంది జయతీర్థ మధ్యారాధన మహోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమంత్ కులకర్ణి, సంజీవ్ కులకర్ణి, నరసింహాచారి, ఉపేంద్రాచారి, శ్రీనివాసాచారి, దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా చిన్న సరిగెత్తు



ప్రధాన రహదారిలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు

సిరుగుప్ప, జూలై 26 : కోలాహలంగా చిన్న మొహర్రం పండుగ వేడుకలు జరిగాయి. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా అన్ని చోట్ల చిన్న మొహర్రం సందర్భంగా పీర్ల దేవుళ్లను పూలమాలలతో అలంకరించారు. గురువారం రాత్రి కత్తుల రాత్రి సందర్భంగా పీర్లదేవుళ్లను మోసుకుని అగ్నిగుండంలో నడిచారు. అనంతరం ప్రధాన రహదారుల గుండా పీర్లదేవుళ్లను భక్తులు ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



పీర్లదేవుళ్లకు పుష్పాలంకరణ

హోసూరు జోన్

ఒకే మొక్కకు 80 బ్రహ్మకమలాలు



విరబూసిన బ్రహ్మకమలాలు

హోసూరు జూలై 26: హోసూరు కారపల్లికి చెందిన ఇళయరాజ ఇంట్లో ఒకే మొక్కలో 80 బ్రహ్మకమల పుష్పాలు వికసించడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆనందంలో ఇంటి వారంతా ఆ మొక్కకు పూజలు నిర్వహించారు. సంవత్సరానికి ఒక్కసారి పూసే ఈ పూలు రాత్రి పూట మాత్రమే వికసిస్తాయి. తెల్లవారి చూసేలోపుగా వాడి పోతాయి. ఈ మొక్కను స్థానికులు అందరు వచ్చి వీక్షించారు.

నేడు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

హోసూరు జూలై 26: హోసూరులో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం రాంనగర్ అన్నా విగ్రహం దగ్గర భారీ నిరసన ప్రదర్శన జరపనున్నట్లు ఎమ్మెల్యే జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ భారతదేశం మొత్తానికి ఆర్థిక వర్తించే విధంగా కనిపించడం లేదని, తమిళనాడు వంటి రాష్ట్రాలకు ఏ మాత్రం ఉపయోగపడే విధంగా లేదన్నారు. కొన్ని రాష్ట్రాలకు తమ పాలనను కాపాడుకోవడానికి ఉదారంగా నిధులు అందించారన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన డిమాండును పట్టించుకోలేదన్నారు. బీజేపీ సవతి తల్లిలాగా తమిళనాడును మోసం చేసిందన్నారు. అందరూ ఈ నిరసనలో పాల్గొనాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కార దినోత్సవంలో 237 వినతిపత్రాలు

హోసూరు(కృష్ణగిరి) జూలై 26: కృష్ణగిరి జిల్లా రైతుల సమస్యలను నేరుగా విని వాటిని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి నెలా రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన రైతు ఫిర్యాదుల పరిష్కార దినోత్సవంలో రైతుల నుంచి 237 వినతి పత్రాలు అందాయి. సమావేశంలో వ్యవసాయానికి సంబంధించిన పలు సమస్యల గురించి ప్రస్తావించారు.

ఏటీఎం చోరీల కట్టడిపై అవగాహన



హోసూరు సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశం దృశ్యం

హోసూరు(క్రైం) జూలై 26: హోసూరు సబ్‌డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంకు భద్రత, ఏటీఎం చోరీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి డీఎస్పీ బాబుప్రశాంత్ అధ్యక్షత వహించారు. బ్యాంకు ఏటీయంలకు 24 గంటలు పాటు పనిచేసేందుకు గార్డులకు నియమించాలని కనీసం రాత్రి వేళ్లలో సెక్యూరిటీ గార్డులను నియమించాలని బ్యాంకులకు విజ్ఞప్తిచేశారు. బ్యాంకు ఏటిఎం సెంటర్‌లోని అన్ని నిఘా కెమరాలు పనిచేయాలని, వీటిని ప్రతిరోజూ తనిఖీ చేయాలని, ఏటిఎం సెంటర్ల్లో డబ్బులు నింపిన తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. ఏటీఎం భద్రతా వ్యవస్థ మార్చాలని, ఏటిఎం తలుపు తెరవడానికి లేదా మూసివేయడానికి ప్రయత్నిస్తే ఏటిఎం అలారం మోగేలా సెట్ చేయాలని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యాంకులు తమ మేనేజర్లు , పోలీసు శాఖతో కలిసి పనిచేయడానికి వాట్సాప్ గ్రూప్ ప్రారంభించామని, అనుమానితుల వివరాలను, పంపించాలన్నారు. ఖాతాదారుడి నుంచి డబ్బును దొంగిలించే ముఠాల నుంచి కస్టమర్‌ను రక్షించడానికి అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో హోసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యాంకుల్లో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్

దర్వేష్ కంపెనీ మోసాలపై సీఐడీ విచారణ



రాయచూరు ఎస్పీ కార్యాలయానికొచ్చిన సీఐడీ అధికారుల బృందం, దర్వేష్ కంపెనీ కార్యాలయం

రాయచూరు, జూలై 26 : అధిక వడ్డీ ఆశతో పెద్ద ఎత్తున డిపాజిట్‌లు సేకరించి ముఖం చాటేసిన రాయచూరు దర్వేష్ కంపెనీ వ్యవహారంపై సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. వందల కోట్ల మేరకు డిపాజిట్‌లు తీసుకున్న దర్వేష్ కంపెనీ, అసలు యజమాని ఇప్పటికే ముఖం చాటేసి వెళ్లిపోగా ఏజెంట్లుగా పని చేసిన వారు కొందరు ఖాతాదారులకు అందుబాటులో లేకుండా పోయారు. ఈ క్రమంలో డిపాజిట్‌లు చేసిన వారు దర్వేష్ కార్యాలయం వద్ద గొడవకు దిగడంతో రంగ ప్రవేశం చేసిన మార్కెట్ యార్డ్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. ఈ విషయం ఇటీవల శాసనసభ, శాసన మండలిలో ప్రస్తావనకు రాగా సీఐడీ విచారణకు ఆదేశించినట్లు మంత్రులు కృష్ణబైరేగౌడ, ఎన్.ఎస్.భోసరాజులు ప్రకటించారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లాకు వచ్చిన సీఐడీ అధికారుల బృందం జిల్లా ఎస్పీ పుట్టమాదయ్యను కలిసి వివరాలు సేకరించారు. దర్వేష్ కంపెనీ అవినీతి వ్యవహారానికి సంబంధించి సీఐడీ బృందానికి పురుషోత్తమ్ నేతృత్వం వహిస్తుండగా అధికారుల బృందం ఖాతాదారులతో సహ ఏజెంట్లుగా వ్యవహరించిన అందరి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లంక గ్రామాలను సందర్శించిన అధికారులు

రాయచూరు, జూలై 26 : జిల్లా సరిహద్దులోని కృష్ణా నదికి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో నది నడిగడ్డలో ఉన్న లంక గ్రామాలను శుక్రవారం జిల్లా అధికారులు సందర్శించారు. సహాయ కమిషనర్ అవినాశ్ సింధె, డీఎస్పీ దత్తాత్రేయ కార్నాడ్, తహసీల్దార్ శంశాలం, ఆరోగ్యాధికారి అమరేశ్ పాటీల్‌లు లంక గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలకు ఆహార వస్తువులను అందజేశారు. ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సాధారణ బోట్‌లు పని చేయని కారణంగా అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మరబోట్‌ల ద్వార అధికారులు ప్రయాణించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున మరింత జాగ్రత్తగా ఉండాల్సిందిగా అధికారులు సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

డాక్టర్ అబ్దుల్‌కలాం (వర్ధంతి)



భారతరత్న గ్రహీత డాక్టర్ అబ్దుల్‌కలాం 1931 అక్టోబరు 15న రామేశ్వరంలో జన్మించారు. రాష్ట్రపతిగా 2002 నుంచి 2007 వరకు వ్యవహరించారు. అంతకు ముందు సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఇస్రో, డీఆర్‌డీఓలలో ఏరోస్పేస్ ఇంజనీర్‌గా వ్యవహరించి 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందారు. పోఖ్రాన్‌లో 1998లో నిర్వహించిన అణు ప రీక్షలలోనూ కీలకంగా వ్యవహరించారు. విద్యను ఎంతో ప్రోత్సహించారు. ఎన్నో పుస్తకాలు రాశారు. పద్మ భూషణ్, పద్మవిభూషణ్, వీర్‌సావర్కర్ పురస్కారం, పలు యూనివర్శిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు అందు కున్నారు. 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పేరిట ఆటోబయోగ్రఫీ రాశారు. 2015 జూలై 27న కన్నుమూశారు.

డి. మధుసూధనరావు (జయంతి)



దాదాసాహెబ్ ఫాల్కే గ్రహీత దుక్కిపాటి మధుసూధనరావు 1917 జూలై 27న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా పెయ్యేరు గ్రామంలో జన్మించారు. తెలుగు సినీ నిర్మాత, రచయితగా రాణిం చారు. రఘుపతి వెంకయ్య అవార్డు వంటి ఉన్నత గౌరవాలు అందుకున్నారు. 'అన్నపూర్ణ పిక్చర్స్' సొంత బ్యానరుపై 22 సినిమాలు రూపొందించారు. మాన వతా విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. తోడికోడళ్ళు, మాంగల్య బలం వంటి హిట్ సినిమాలు రూపొందిం చారు. అక్కినేని నాగేశ్వరరావు, వహీదా రెహమాన్ వంటి ప్రముఖులను సినిమా రంగానికి ఆయనే పరి చయం చేశారు. 'డాక్టర్ చక్రవర్తి' సినిమాకు నంది అవా ర్డు దక్కింది. నాలుగు జాతీయ సినీ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 2006 మార్చి 26న కన్నుమూశారు.

విశ్వమోహన్‌భట్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత పండిట్ విశ్వమోహన్‌భట్ 1950 జూలై 27న రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జన్మించారు. హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో ప్రత్యేకించి 'మోహన వీణ'ను వాయించ డంలో పేరొందారు. హవాయి గిటార్‌కు అదనంగా 14 తీగలు అమర్చి మొత్తం 20 తీగలతో 'మోహన వీణ'గా ఇండియనైజ్ చేశారు. దేశీయ, పాశ్చాత్య సంగీతాన్ని మేళవించి తనదైన ప్రతిభను కనబరిచారు. ఐదు దశా బ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కచేరీలు ఇచ్చారు. 1993లో 'ఏ మీటింగ్ బై ది రివర్' ఆల్బమ్‌కు ఉత్తమ సంగీత గ్రామీ అవార్డు దక్కింది. పద్మశ్రీ, పద్మభూషణ్ సంగీత నాటక అకాడమీ అవార్డు, నేషనల్ తాన్‌సేన్ అవార్డు, గ్లోబల్ మ్యూజిక్ అవార్డు, సెయింట్ పీటర్స్‌బర్గ్ యూని వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ తదితర గౌరవాలు అందుకున్నారు.

అలెన్ బోర్డర్ (పుట్టినరోజు)



అలెన్ రాబర్ట్ బోర్డర్ 1955 జూలై 27న ఆస్ట్రేలియా దేశం న్యూసౌత్ వేల్స్ ప్రాంతంలో జన్మించారు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అంత ర్జాతీయ క్రికెటర్‌గా, కామెంటేటర్‌గా రాణించారు. 156 టెస్ట్‌మ్యాచులు, 27 సెంచరీలు సాధించారు. టెస్టులలోనూ, వన్డేలలోనూ సత్తా చాటుకున్నారు. 11,174 పరుగులు చేసి రికార్డు సృష్టించారు. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు. ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా సభ్యుడిగా, ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియాగా గుర్తింపు పొందారు. ఆస్ట్రేలియన్ స్పోర్ట్స్ మెడల్ పురస్కారం, 2021లో ఆస్ట్రేలియా పోస్ట్ లెజెండ్ ఆఫ్ క్రికెట్ గౌరవం అందుకున్నారు.

చిత్ర (పుట్టినరోజు)



ప్రముఖ నేపథ్య గాయని చిత్ర 1963 జూలై 27న కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జన్మించారు. పూర్తి పేరు కృష్ణన్ నాయర్ శాంత కుమారి (కేఎస్) చిత్ర. గాయనిగానే కాక కర్ణాటక సంగీతంలోనూ రాణించారు. కేరళ రాష్ట్రంలో కల్చరల్ ఐకాన్‌గా గుర్తింపు పొందారు. నాలుగు దశాబ్దాలలో వివిధ భాషలలో 25వేలకు పైగా పాటలు పాడారు. మెలోడీ క్వీన్, నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియాగా పేరొందారు. పద్మభూషణ్, 'పద్మశ్రీ' అవార్డు, 36 రాష్ట్రాల నుంచి వివిధ సినీ పుర స్కారాలు అందుకున్న గాయనీమణి. జాతీయ, అంతర్జాతీయ వేడుకల్లోనూ సత్కారాలు పొందారు. ప్రపం చంలో పేరొందిన లండన్‌లోని రాయల్ అల్బర్ట్‌హాల్‌లో పాటలు పాడిన దక్షిణాదికి చెందిన ఏకైక గాయనీమణి కావడం గమనార్హం. ది గ్రేటెస్ట్ ఇండియన్ సింగర్‌గా బ్రిటీష్ పార్లమెంటు హౌస్ ఆఫ్ కామన్స్‌నుంచి అరుదైన గౌరవం పొందారు.

విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలు కావాలి

- గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలకు విశ్వవిద్యాలయాలు కేంద్రాలు కావాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అభిప్రాయపడ్డారు. గార్డెన్‌సిటీ యూనివర్సిటీ ఆరో స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ యూనివర్సిటీ ఇంకుబేషన్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో కేవలం అకడమిక్‌తో సరిపోదని నైపుణ్యత కీలకమన్నారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారితేనే భవిష్యత్తు సమాజంలో మరిన్ని సౌలభ్యాలు సామాన్యులకు చేరువ అవుతాయన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ జోసెఫ్ వి.జి. మాట్లాడుతూ గార్డెన్‌సిటీలో పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చే కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలను విద్యార్థులకు ప్రదానం చేశారు. అత్యాధునిక బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో పట్టాలను ప్రదానం చేశారు.



స్నాతకోత్సవంలో గవర్నర్‌కు సన్మానం

సైనికుల దేశభక్తి స్ఫూర్తిదాయకం



కార్గిల్ విజయ్‌దివస్‌లో ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు

దొడ్డబళ్లాపుర, జూలై 26: కార్గిల్‌యుద్ధం ప్రతి భారతీయుడి మనస్సులో చెరగని ముద్ర వేసిందని నేటి యువత కూడ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎన్‌సీసీ రిటైర్డు అధికారి మేజర్ ఎస్ మహబలేశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కొంగాడియప్ప కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవ్‌ను శుక్రవారం అర్థవంతంగా ఆచరించారు. భారత దేశ చిత్రపటం గీసి దానిచుట్టూ కొవ్వొత్తులు వెలిగించారు. కార్గిల్‌యుద్ధంలో పోరాడి అసువులు బారిన సైనికుల గౌరవార్థం కార్గిల్ విజయ్‌దివస్‌గా ఆచరిస్తున్నారన్నారు. 1999 మేలో ఆరంభమైన కార్గిల్‌యుద్ధం జూలైవరకు సుమారు రెండునెలలపాటు కొనసాగిందన్నారు. యుద్ధంలో లేహ్ జాతీయరహదారిపైకి చొరబడిన పాకిసేనను నియంత్రించడంలో భారతీయసేన విజయం సాధించిందన్నారు. ఈ యుద్ధంలో 527 భారతీయ సైనికులు కన్నుమూశారని పేర్కొంటూ రెండు నిమిషాలపాటు మౌనం వహించారు. కార్యక్రమంలో పీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఆనందమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్, ఎస్‌ఎస్ శివశంకర్, ఎన్‌సీసీ అధికారులు శ్రీనివాస, ప్రవీణ్, శ్రీకాంత్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన

చింతామణి, జూలై 26: పట్టణంలోని గాయన సమాజం ఆధ్వర్యంలో 42వ వార్షిక వాగ్గేయకారుల ఆరాధనా మహోత్సవం, చింతామణి మహావిద్యాలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్ సమీపానగల గణపతి దేవాలయం నుంచి ఊరేగింపుగా నగర సంకీర్తన బయల్దేరింది. రాజీవ్‌నగర్ లే అవుట్‌లోని సంగీత మహావిద్యాలయం వరకు సాగింది. త్యాగరాజస్వామి చిత్రపటంతో ఊరేగుతుండగా కోలాటం, భజన, గాయన సమాజానికి చెందిన పిల్లల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో గాయన సమాజ ప్రిన్సిపాల్ సంగీత విద్వాన్ పద్మా, జానపద కళాకారురాలు లీలా లక్ష్మినారాయణ్, కైవార మౌర్య ట్రస్టు శ్వేతా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన ఊరేగింపులో భరతనాట్య ప్రదర్శన

కోర్టు విధుల బహిష్కరణ

బాగేపల్లి, జూలై 26: బాగల్కోటె జిల్లా బాదామి తాలూకా కోర్టులో న్యాయవాదిని అరెస్టు చేయాలన్న న్యాయమూర్తి ఆదేశాలను తాలూకా న్యాయవాదుల సంఘం ఖండించింది. శుక్రవారం పట్టణంలోని జేఎంఎఫ్‌సీ కోర్టు ఆవరణలో ఈమేరకు కోర్టు కార్యకలాపాలను బహిష్కరిస్తూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నంజుం డప్ప మాట్లాడుతూ న్యాయవాదులపై కూడా దౌర్జన్యాలు చోటు చేసుకుంటు న్నాయన్నారు. బాదామి తాలూకా న్యాయమూర్తి సంజుకుమార్ కోర్టులోనే న్యాయవాదిని అరెస్టు చేయాలని పోలీసులకు సూచించారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఒకరోజు కోర్టు కార్యలాపాలను బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. నిరసనలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిన్నస్వామి, ముస్తక్ అహ్మద్, అల్లాబక్ష్, పెద్దసంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు కార్యకలాపాలను బహిష్కరించిన న్యాయవాదులు

బయలుసీమకు కృష్ణా నీరు వచ్చేలా చేయండి

శిడ్లఘట్ట, జూలై 26: బయలుసీమ ప్రాంతానికి కృష్ణా నదినీరు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని తద్వారా రైతులకు మేలు చేయాలని కేంద్ర రైల్వే, జలశక్తి రాష్ట్రమంత్రిని సోమణ్ణను కోరినట్టు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ తెలిపారు. కేంద్రమంత్రి సోమణ్ణను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో భేటీ అయి వినతిపత్రం అందచేశామని ఎమ్మెల్యే తెలిపారు. చిక్కబళ్లాపుర, కోలారు, బెంగళూరు గ్రామీణ, తుమకూరు, చిత్రదుర్గ జిల్లాలైన బయలుసీమకు కృష్ణానది నీటిని వచ్చేలా చేయాలని కోరామన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటాయని 1500 అడుగులకు నీరు చేరిందన్నారు. బోర్లలో 30శాతం మాత్రమే ఉందని, ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందన్నారు. కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు అప్పేగౌడనహళ్ళి లక్ష్మీనారాయణరెడ్డి, జడ్పీ మాజీ సభ్యుడు బంకు మునియప్ప, తాదూరు రఘు, సందీప్, మేలూరు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఉమేశ్, కుందలగుర్కి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి సోమణ్ణకు వినతిపత్రం అందజేత

కార్మిక వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

బాగేపల్లి, జూలై 26: కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక బడ్జెట్ సమర్పించిందని రైతులు, కార్మికులు, యువతకు వీలుగా ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టలేదని సీపీఎం ఆరోపించింది. ఈ మేరకు పట్టణంలోని జీవీ శ్రీరామరెడ్డి కాంస్య విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముని వెంకటప్ప మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్డీయే మిత్రపక్షాల రాష్ట్రాలకు గ్రాంట్లు ఇచ్చి ందని కర్ణాటకకు ఎటువంటి ప్రత్యేక గ్రాంట్లు కేటాయించలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటినా నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. నిరుద్యోగుల సమస్య పరిష్కారంలేదన్నారు. దళిత హక్కుల జిల్లా అధ్యక్షుడు బిళ్ళూరు నాగరాజు మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చారని కర్ణాటకకు మాత్రం ఎలాంటి గ్రాంట్లు ఇవ్వ లేదన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో సీపీఎం తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి, వాల్మీకి అశ్వత్థప్ప, ముస్తఫా, చన్నరాయప్ప, కృష్ణప్ప, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయనగర్‌లో కంచి చీరల ప్రదర్శన

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వరుసగా సంప్రదాయ పండుగలు వస్తున్న తరుణంలో మహిళలు మెచ్చే కంచిపట్టు చీరలను జయనగర్‌లోని జగదీశ్ హోటల్‌లో ప్రత్యేక ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. వరాహిలక్ష్మి సిల్క్స్ నగరంలో తొలి ప్రదర్శనలను శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగించేలా ఏర్పాటు చేశారు. వివిధ పట్టుచీరలు, కంచీపురం, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ చేతిమగ్గాలతో తయారైన చీరలు అందుబాటులో ఉంచినట్టు వరాహి సంస్థ ఎండీ గోపినాథ్ తెలిపారు. చేనేత కార్మికుల నుంచి నేరుగా డిజైన్లను రూపొందించామని వివరించారు. రూ.500 నుంచి రూ.2లక్షల విలువైన పట్టుచీరలు లభ్యమన్నారు.



చీరల ప్రదర్శన ఇలా..

32 గేట్ల నుంచి నీటి విడుదల



తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

బొమ్మనహాళ్, జూలై 26: తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో మొత్తం 32 గేట్ల క్రస్ట్‌గేట్ల(20 గేట్లు రెండున్నర అడుగులు, మరో 12 గేట్లు రెండు అడుగుల మేర)ను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 1,07,096 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8952 క్యూసెక్కు లను కాలువలకు విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం జలాశయానికి ఇన్‌ఫ్లో 1,05,378 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,16,228 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా శుక్రవారం సాయంత్రానికి 1631.96 అడుగులతో 101.617 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 768 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సమాజసేవతోనే జీవితానికి సార్థకత

చిక్కబళ్ళాపుర, జూలై 26 : సమాజసేవతోనే జీవితానికి సార్థకత సాధ్యమవుతుందని సద్గురు మధుసూధన సాయి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ముద్దేనహళ్ళి సత్యసాయి గ్రామంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపదను సమాజహితం కోసం వినియోగించడమే సేవ అన్నారు. సేవ ఎప్పుడూ ప్రవహించేనదిలాంటిదని, జీవితానికి అర్థం చెప్పే పరమమంత్రం శాంతి అన్నారు. ఇదే సందర్భంగా 25కుపైగా వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాహనాల ద్వారా చుట్టుపక్కల 36 గ్రామాలలో అవసరమైన మందులు, ఇతర వైద్య సేవలు అందించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శిరూరు మట్టిచరియల ప్రమాదంలో

లారీ డ్రైవర్ సగం మృతదేహం లభ్యం



శరవణన్ (ఫైల్)

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా జాతీయ రహదారి 66పై శిరూరు వద్ద మట్టిచరియలు కుంగిన ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ శరవణన్ మృతదేహాన్ని గుర్తించారు. డీఎన్ఏ ద్వారా శరవణన్‌దిగా నిర్ధారించినట్టు జిల్లా ఎస్పీ నారాయణ్ శుక్రవారం తెలిపారు. నాలుగురోజుల క్రిందట గంగావళి నదీ తీరంలో కడుపు కిందిభాగం మృతదేహాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. సదరు మృతదేహాన్ని డీఎన్ఏ పరీక్షల ద్వారా డ్రైవర్ శరవణన్‌గా నిర్ధారించినట్టు ఎస్పీ తెలిపారు. మట్టిచరియలు విరిగిపడిన ప్రాంతంలోనే శరవణన్ నడుపుతున్న ట్యాంకర్ ఉండేది. జిల్లా యంత్రాంగం ట్యాంకర్‌ను మరో ప్రదేశానికి తరలించారు. అయితే శరవణన్ గుర్తించలేకపోయారు. శరవణన్ కనిపించడం లేదని అతడి మామ సెంథిల్ అంకోలా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి మొబైల్ లో బ్యాటరీతో ఆఫ్ అయి ఉంటుందని ఫిర్యాదులో ప్రస్తావించారు. మృతదేహం లభించిన తర్వాత శరవణన్ బంధువులు వచ్చి ఆనవాళ్లను గుర్తించారు.

కర్నూలుకు ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి నాన్ ఏసీ స్లీపర్

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ సర్వీసును కర్నూలుకు ప్రారంభించారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటలకు బయల్దేరి తెల్లవారుజామున 5.15 గంటలకు కర్నూలుకు చేరుకోనుందని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రరెడ్డి తెలిపారు. కర్నూలు నుంచి కూడా రాత్రి 10 గంటలకు ఇదే సర్వీసు సౌలభ్యం ఉందన్నారు. బెర్త్ సదుపాయం కలదన్నారు. కింది బెర్త్ రూ.920, పైన బెర్త్ రూ.850గా చార్జీ ఉంటుందన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌలభ్యాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లు, లేదా ఏపీఎస్‌ఆర్టీసీ అధికారిక ఏజెంట్‌ల వద్ద కూడా రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు.

తెలంగాణ ఆర్టీసీలో ప్రయాణికులకు ప్రత్యేక రాయితీ

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు తెలంగాణ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేవారికి ప్రత్యేక రాయితీ సౌలభ్యం ఉందని బెంగళూరు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రసాద్‌గౌడ వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచే అమలైనట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసుకున్నవారికి రాయితీ సౌలభ్యం వర్తిస్తుందన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వచ్చేవారికి ఈ సౌలభ్యం ఉంటుందన్నారు. బెంగళూరు నుంచి వారాంతంలో హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్ర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులకు ఇదో సదవకాశమన్నారు. స్లీపర్ బస్సు సౌకర్యం ఉందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆగస్టు 1 నుంచి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి వర పుత్ర, ప్రవచన చతుర బిరుదు కల్గిన డాక్టర్ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు ఆగస్టు 1నుంచి వారం రోజులపాటు నిర్వహించనున్నారు. మారత హళ్ళిలోని న్యూహొరిజన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆడిటోరియంలో 'మహాభారతంలో మనకోసం మంచిగాథలు' అనే శీర్షికన ప్రవచనాలు ఉంటాయని రుషిపీఠం సత్సంగ సభ్యులు వెల్లడించారు. మానవాళి జీవనసాఫల్యం కోసం వ్యాస మహర్షి ఎన్నోకథల రూపంలో సందేశాలను ఇచ్చారని వాటికి సంబంధించి ప్రవచనాలు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ప్రవచనాలు ఉంటాయన్నారు. అందరూ ఆహ్వానితులేనన్నారు.

గ్రాండ్‌ఫిలా మార్కెట్‌లో కళాఖండాలు



కళాఖండంతో నౌమితాజ్యోతి

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చిత్రకళా పరిషత్‌లో గ్రాండ్‌ఫిలా మార్కెట్ ఆధ్వర్యంలో మీనా బజార్ పేరిట కళాఖండాల ప్రదర్శనను ఏర్పాటు చేశా రు. శుక్రవారం లైఫ్‌స్టైల్ డిజైనర్ నౌమితాజ్యోతి ప్రదర్శన లు ప్రారంభించారు. పదిరోజులపాటు ప్రద ర్శనలు కొనసాగుతాయన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రముఖ చేతివృత్తుల కళాఖండాలు అందు బాటులో ఉంటాయన్నారు.

దామాషా పద్ధతిలో డివిజన్‌కు నిధులు

దక్షిణమధ్య రైల్వే జీఎం

గుంతకల్లు, జూలై 26: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయించిన నిధులకు సంబంధించి ఏపీకి 9, 130 కోట్లు వచ్చాయని, గుంతకల్లు రైల్వే డివిజన్‌కు అందులో నుంచి దామాషా పద్ధతిలో నిధులు వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన గుంతకల్లులో పర్యటించారు. ఉదయం రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లుకు వచ్చిన ఆయన డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిర్మించిన అత్యాధునిక రైల్వే కంట్రోల్ రూం భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి గణనీయమైన నిధులు వచ్చాయని, అందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు ఎంత వచ్చిందీ త్వరలో తెలుస్తుందన్నారు. బడ్జెట్ ద్వారా ఏ రైళ్లు వస్తాయో ఇంకా తెలియదని, ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడుపుతామన్నారు. బడ్జెట్ కేటాయింపులపై పూర్తి వివరాలు పింక్ బుక్ విడుదలైన తర్వాత తెలుస్తాయన్నారు. అనంతరం గుంతకల్లు రైల్వే జంక్షన్‌ను పరిశీలించి తిరుగు ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో డీఆర్ఎం విజయకుమార్, ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.